


# సత్యం మాష్టారు

— చావా శివకోటి

**నాకు బాగా పసితనమది.**
**నిజాం పాలన ఇంకా పోలేదు.**
**నాకు ఓ అన్న ఉన్నాడు. నాకంటే నాలుగేళ్ళు పెద్ద. పేరు ఆంజనేయులు.**

ఒక్కతోకే లేదుగానీ-ఇప్పటి కోతులకేమాత్రం తీసిపోడు.

ప్రభుత్వపు బడి ఉంది మా ఊళ్ళో ఏడవ తరగతి వరకు.

అక్కడ మూడో తరగతి (తీ(సీ) చదువుతున్నాడు.

నాకు కొంచెం ఊహ తెలుస్తున్నప్పటి నుంచీ వాడు ప్రొద్దుటే తయారయి, పుస్తకాలు సంచిన వేసుకొని, కిఱ్ఱు చెప్పులు వేసుకొని 'బడి'కి వెళ్ళడం నన్ను ఆకర్షించింది.

''నేనూ బడికి వెళ్తాను'' అన్నాను ఒకనాడు అమ్మతో.

నాకు చదువుపై కలిగిన ఆసక్తికి అమ్మ ముచ్చటపడి నన్ను అమాంతం ఎత్తుకొని, ముద్దులు పెట్టి, మురిసిపోయింది, ఇంటి పని వాళ్ళతో,

'చిన్నోడు బడికి వెళ్తానంటున్నాడు' అని చెప్పి చాలా సంబరపడింది. అమ్మ సంతోషం చూశాక నన్ను బడికి తప్పక పంపుతారనిపించింది. ఆ రాత్రి భోజనాలప్పుడు నాన్నకు వడ్డిస్తూ అడిగింది.

అంతా విని చికాకుగా చూసి 'వీడికా! చదువా!

అక్కరలేదు' అన్నాడు కటువుగా.

వాడంతట వాడే 'బడి'కి వెళ్తానంటుంటే' అంది అమ్మ.

నేను చూస్తున్నాను నాన్నను.

'ఇక ఆపుతావా!' అన్నాడు నాన్న కోపంగా.

'నేనేమన్నాననీ -' అంది కొంచెం ఎడంగా జరిగి.

'ఇదిగో! నీకు మా వంశక్రమం తెలుసా?' అన్నాడు.

అయోమయంగాచూస్తూ నిలబడింది అమ్మ.

'మా ముత్తాత ఒక్కడే. ఆయనకు మా తాత గారు ఒక్కడే. ఆయనకు మా నాన్న, ఆయనకు నేను' అంటూ అమ్మ కళ్ళలోకి సూటిగా చూసి 'నాకూ ఒక్కడే మిగిలి వుంటాడు. ఆ మిగిలే వాడు బడికి వెళ్తున్నాడు గదా!' అన్నాడు.

అమ్మ ఏదోలా అయింది ఈయన మాట లకు.

కళ్ళ నిండా నీరుబికింది.

ముఖమంతా కందగడ్డ లాగయింది.

నాన్నేమో మజ్జిగ అన్నంలో చల్ల మిరపకాయ కొరికి నములుతూ తద్వారా కలిగే 'రుచి'ని ఆబగా ఆస్వాదిస్తూ కనిపించాడు.

'అసలీ శాల్తీ - మిగిలేది కాదు. ఊడిపోయేదే! అది తెలిసే అనవసరపు పెట్టుబడి ఎందుకు?' అన్న స్థిరమైన అభిప్రాయం ఆయనలో స్పష్టంగా కనిపిం చింది.

ఆయన వితండపు ఆలోచనకు అమ్మ ఖిన్ను రాలైంది.


అప్పటికి అమ్మ నోరు మెదపక గుడ్లనీరు కుక్కుకుంది.

అయితే,

అప్పుడే చలక నుంచి ఇంటికి వచ్చిన మా తాతగారు నాన్న మాటలను విన్నాడు. అసహనంగా కొడుకును చూశాడు తప్ప ఆయనా మాటాడలేదు. నాలుగోనాడు మాత్రం అమ్మ నాకు కుంకుళ్ళతో ప్రొద్దుటే తలకి పోసింది. తలకు నూనెరాసి కొమ్ము దువ్వెనతో క్రాపు తీసింది. కొత్త బట్టలు తొడిగి నుదుట బొట్టు పెట్టింది. అప్పుడు తాతగారు, పలక బలపం చేతి సంచీ నాకిచ్చారు. నాకు నిజంగా వెన్నెలమడుగు ఆటలో గెలిచినంత ఆనందం కలి గింది. పలకా బలపం సంచిలో పెట్టుకున్నాను. తాత గారి వంక ఆరాధనగా చూశాను.

అమ్మ తాతగారి కాళ్ళకు నాతో దండం పెట్టించి ఆశీర్వాదం ఇప్పించింది.

'ఏమైనా తినిపించావా? సత్యం మాష్టారుకు




అప్పగించి వస్తాను' అన్నాడు తాతయ్య.

'ఒక్క నిముషం' అని అమ్మ ముద్ద పప్పుతో ఇంత నెయ్యి వేసి కొద్దిగా అన్నం కలిపి నాకు గబగబా తినిపించింది. మూతి కడిగి మంచినీళ్ళు త్రాగించి పైట చెరగుతో నా మూతి శుభ్రంగా తుడిచి నన్ను తాత గారికి అప్పగించింది.

'ఇక పద' అన్నాడు.

వెంట నడిచాను.

సీదా సత్యం మాష్టారు ఇంటికి తీసుకెళ్ళాడు.

అక్కడ నలభై మంది దాకా పిల్లలు. పలకా పుస్త కాలతో వల్లెవేస్తూ కనిపించారు.

ఆ రోజులలో ప్రైవేటు బడులు నడపాలన్నా - నైజాం పాలన గనుక భయపడే వారు.

ఇట్టా ఎట్టా పడితే అట్టా చదువు చెప్ప రాదని- ఫర్మానా ఉండట. అంచేత-పాఠాలు చెప్పే పంతులు ఉండే ఇంట్లోనే ఈ బడులు పెట్టుకునేవారు. ప్రభుత్వ పరంగా ఎవరైనా అడిగితే బడి పిల్లలకు ప్రైవేట్లు చెపుతున్నారు అనే వారు. దాన్ని ఊరి పోలీసు పటేలూ, మాలీ పటేలూ, పట్వారీ దీనిని సమర్థించే వారు.

ఇక ప్రభుత్వ బడులలో 'ఉర్దూ' చెప్పేవారు.

మా తాతగారు కనిపించగానే సత్యం మాష్టారు ఎదురొచ్చి లోనకు తీసుకెళ్ళి పెద్ద బల్లా పీటపైన కూర్చొనబెట్టారు.

లోనకెళ్ళి మంచినీళ్ళ చెంబుతో చల్లటి నీళ్ళి చ్చాడు.

ఆనక తాతగారు మాష్టారికి నన్ను అప్పగిం చారు.

'వీడు నా మనుమడు. నాల్గు అక్షరాలు గట్టిగా నేర్పు. ఇవ్వాళ్ళ దశమి. మంచి రోజు. అందుకే తీసు కొచ్చాను' అని జేబు నుంచి పదకొండు రూపా

యలు తీసి మాష్టారుకిచ్చాడు.

ఇప్పుడెందుకూ? తోచినప్పుడు పంపితే పోయేది' అని మొహమాట పడుతూనే పైసలు తీసు కున్నాడు.

'పంతులూ డొక్క శుద్ధి కొద్దిగానైనా లేంది మనుషుల్లో కలవలేం. ఆ దంపున చేరేందుకూ, అక్కడ మనగలిగేందుకూ అక్షరజ్ఞానం అవసరం' అని నవ్వి 'దాన్ని గమనించు' అంటూ లేచాడు తాతయ్య.

తల ఊపి తాతయ్య వెంట నడిచాడు మాష్టారు.

గడప దాటి తోవకొచ్చాక ఆగాడు తాతయ్య,

మాష్టారు భుజాన చేయి వేసి 'పంతులూ నీ పరిస్థితి ఎలావుంది. తినా కుడువా సరిపోతున్నదా?' అని పరామర్శించాడు.

ఇదిలా ఉన్న టైంలోనే మాష్టారు ఇంటిలోపల నుంచి ఓ ఆడ మనిషి తొంగి చూసింది.

ఆవిడే మాష్టారి భార్య అని తరువాత తెలి సింది.

'ఇటూ ఒక్క మాట' అని పిలిచింది.


నేనాయన వైపు చూశాను.

ఆయన పిలిచిన ఇల్లాలి వైపు చూస్తున్నాడు.

తాతయ్య ఆ ఇద్దర్నీ చూసి అడుగు కదిపాడు.

ఇంతలో 'నాన్నారూ' అంటూ ఓ పన్నెండు పదమూడేళ్ళ పిల్ల సుడిగాలిలా మాష్టారి దగ్గరికి వచ్చి గలగలా ఏదో చెప్పింది. డబ్బాలో రాళ్ళూపి నట్టు. తెగిన తోకచుక్కలా వెంటనే వెనక్కి వెళ్ళి పోయింది. వాలుగాలిన ఉన్న గాలిపటంలా మెరుపు తీగలా ఉంది.

అట్టాగే చూడ బుద్ధవుతుంది. అలా చూస్తూనే ఉండిపోయాను.



ఆ పిల్ల తండ్రితో అసలేం చెప్పిందో కూడా నాకు వినిపించలేదు.

కానీ అమ్మోరి బొమ్మ గోడమీద వేసినట్ట యింది.

'ఇది మా పిల్ల స్వప్న' అన్నాడు తాతయ్యతో.

అప్పటికే తాతయ్య వెళ్ళిపోయాడు.

'స్వప్న, స్వప్నం అంటే కల కదూ!' అన్నాడో పిల్లాడు నెమ్మదిగా.

ఆ 'కలల్లోనే కాస్త ఊపిరి పీల్చుకునేది' అనుకొని వెనక్కి వచ్చాడు. బల్ల దగ్గర ఆగాడు.

నాకెందుకో గానీ సత్యం మాష్టార్ని చూశాక చాలా గొప్పగా అనిపించింది.

చిన్న పాటి దేవతా విగ్రహాన్ని చూసినంతటి ఆనందం కల్గింది.

అలా.

నా చదువును మా తాతగారు అలా ప్రారంభించారు.

'వీడికి చదువెందుకు?' అన్న నాన్నగారు, తాతయ్య మాటను కాదనలేక ఊర్కే చూస్తూ ఉండి పోయారు. నా ప్రస్తావన వచ్చినప్పుడల్లా అమ్మ వైపు కోపంగా చూడడంతో ఆగుతూ వచ్చారు. అయితే అప్పటి నుంచి నన్ను పూర్తిగా పట్టించుకోవడం మానేశారు.

నేను బడికి శ్రద్ధగా వెళ్ళసాగాను.

అక్షర మాలతో కుస్తీ ప్రారంభమైంది.

ఆరు మాసాలు గడిచేలోపు గుణింతాల్నూ దాటి పదాలలోకొచ్చాను. ఆ వేళ ఎందుకోగానీ నేను 'బడి'కి కొంచెం ఆలస్యంగా వెళ్ళాను.

మాష్టారుకు హోమ్‌వర్క్ చూపించి తిరిగి వ్రాయడం ప్రారంభిస్తున్నారు మా వాళ్ళు.

ఇంత ఆలస్యమెందుకు అయిందీ? అన్నట్టు చూసి వచ్చి కూర్చోమన్నట్టుగా సైగ చేశాడు మాష్టారు.

అట్నాగే నిల్చున్నాను.

'మీ తాతగారితో చెప్తాను. ఇక ఇలా ఆలస్యంగా వస్తే. వచ్చి కూర్చొని, వరస (వ్రాయి' అన్నాడు. వెళ్ళి కూర్చుని సంచీ విప్పాను.

ఆ కూర్చున్న కూర్చోవడం 'ఒంటేలు' అప్పుడే లేచాను. బాశాపెట్టేసుకుని కదలక కూర్చున డాన ఓ కాలు తిమ్మిరి పట్టింది. దాన్ని వదిలించుకొనడానికి నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఆ

> **'వీడికి చదువెందుకు?' అన్న నాన్నగారు, తాతయ్య మాటను కాదనలేక ఊర్కే చూస్తూ ఉండి పోయారు. నా ప్రస్తావన వచ్చినప్పుడల్లా అమ్మ వైపు కోపంగా చూడడంతో ఆగుతూ వచ్చారు.**

వెంటనే బయటకు పరుగెత్తి గోడవారిన ఒంటేలు పోసుకుంటున్నాను. నా వెంట ఎప్పుడూ కూర్చునే నారాయణ గబగబా నా దగ్గరకు వచ్చి నా చెవి దగ్గర మొఖం పెట్టి 'ఓ మాట' అన్నాడు.

'ఉచ్చ పోసే చోటున చెప్పాల్సిన మాటా, వెధవ' అనిపించింది.

వాడు చెప్ప దలచిందేదో చెప్పేశాడు.

కానీ నాకు అర్థం కాలేదు. అయోమయంగా వానివైపే చూశాను.

'తలలో ఉండేది. అరికాలుకు జారాక ఏం తెలుస్తుంది' అన్నట్టు చూశాడు.

సరిగ్గా చెప్పి ఏడవరాదూ! అన్నాను, అక్కడ నుంచి కదిలి. జేబులో ఉన్న 'బటానీ'లను కొద్దిగా బయటకు తీసి.

'అదేరా! మన మాష్టారు గారి అమ్మాయి స్వప్న ఉందిగదా!'

'ఉంది. ఉంటే.'

'స్వప్న పెద్ద మనిషయిందట' అన్నాడు రహస్యం చెపుతున్నట్టు.

'పొద్దు పొడిచేసరికి అంత పెద్దదెట్టా అయింది' అని నవ్వి 'అకస్మాత్తుగా పెద్దోళ్ళయి పోతారా ఎవరన్నా. నేను ఇంత కావడానికి ఎనిమిదేళ్ళు పట్టింది' అన్నాను.

వాడు వెధవని చూసినట్టు నన్ను చూసి వెళ్ళి పోయాడు.

అసలు స్వప్న మా కంటే ఎత్తుగా, బలంగా, బంగారు తీగలా కూడా ఉంటుంది. మరి ఇప్పుడు హఠాత్తుగా పెద్ద దవడమేమిటి? ఎందుకు వీడిలా చెపుతున్నాడు? అనిపించింది.

'వాడినే వివరం అడిగితే పోలా' అనుకున్నాను. కానీ మా తరగతిలో నేనే అందరి కంటే తెలివిగల వాణ్ణని మాష్టారు అనేకసార్లు అందరి ఎదుటా 'కితాబు' ఇచ్చాడు. కనుక, నారాయణకు తెలిసిన విషయాన్ని తను అడిగి తెలుసుకొనడంతో 'అహం' అడ్డమొచ్చింది.

అంచేత తెలిసినట్టుగా మాటాడక బళ్ళోకి నడిచాను. బటానీలు నములుతూ ఆలోచించాను. బటానీలు అయిపోయినయి కానీ సంగతి అర్థం కాలేదు. అయితే బడి వదలినా నారాయణ మాట నన్ను వదలలేదు. ఇంటికి చేరే లోపు దాని అర్థం తెలుసుకోవాలి అనుకుని నడిచాను. తోవన జంతికలూ, లౌజ వుండలూ అమ్మే అవ్వ కనిపించింది. ఈవిడకు తెలిసి ఉంటుంది. అడుగుదాం అనుకొని దగ్గర కెళ్ళాను. పైగా అవ్వ ఆడ మనిషి గనుక తప్పక తెల్సే ఉంటుంది అన్న ధైర్యంతో ఎదురుగా వెళ్ళి ఆగాను.

చిల్లర పైసల కోసం ఓ చేయి చాపి 'ఏం కావాలి?' అంది.

అర క్షణం తటపటాయించి... తోవ వైపు చూసి ఎవ్వరూ రావటం లేదని అర్థమయ్యాక 'అవ్వా! పెద్ద మనిషి అవడమంటే ఏంటి?' అనడిగాను.

బోసినోరు విప్పి నిండుగా నవ్వుతూ 'ఆడా! మగా!' అనడిగింది.

అడిగిన దానికి సమాధానం లేదు. ఆవిడ ఇంకేదో అడుగుతున్నదేంటి? అనుకొని 'అసలు ఆడా - మగా విడివిడిగా పెద్ద మనుషులవుతుంటారా?' అనడిగాను అమాయకంగా.

'ఓరి నా పిచ్చి మనవడా!' అని విరగబడి

నవ్వింది. చాలా సేపు అలా నవ్వుతూనే ఉన్నది. అంత నవ్వు. అలా నవ్వడం, నేను మొదటిసారి చూశాను. నాకామె పద్ధతేమీ నచ్చలేదు. సంగతి చెప్పక ఏమిటా నవ్వు. ఎగతాళిగా నవ్వినట్టూ అని పించింది.

'అసలేమిటీ ముసలి ముండ' అని సణుగు కుంటూ నడిచాను.

అవ్వ ఆగమని సైగ చేసింది నవ్వు నాపుకొనే ప్రయత్నం చేస్తూ. నాకు మాత్రం ఆగాలనిపించ లేదు.

పైగా అంతుమాలిన కోపం వచ్చింది. మట్టిగడ్డ తీసి దానికి విసరి పరుగెత్తుదామనే అనిపించింది.

'ఛీ! ఇక ఎవర్నీ అడగకూడదు' అనుకుం టూండగా ఆడపిల్ల పెద్దది అవడమంటే 'కుండ' ల్లోకి రావడంరా!' అని ముసల్ది అనడం నా చెవిన పడింది ఆగాను.

'కుండల్లోకి రావడమంటే?'

ఇది మరో ప్రశ్నన్నమాట.

మాష్టారి ఇంట్లో కొత్త కుండలు కొనక్కొచ్చిన జాడ కనిపించలేదు.

కొని ఉంచినదీ లేదు. మరి కుండల్లోకి రావడ మని ముసల్ది ఎందుకు చెప్పింది? నన్ను ఆట పట్టిం చడానికి కాదుగదా! ఇక ఇవ్వాల్టికి దీన్ని వదిలేద్దాం అనుకొని ఇంటికి నడిచాను.

అయితే నారాయణ నాతో ఈ మాట చెప్పి నప్పటి నుంచీ స్వప్న నాకు కనిపించలేదు. కనీసం బయటకు రాలేదు. కనుక బడికెళ్ళాక స్వప్న సంగతి ఆరా తీశాను. సీతా రాములు చెప్పాడు.


స్వప్నను అదిగో ఆ మూల 'గది'లో కొత్త ఈత చాప వేసి దానిపై తెల్లటి దుప్పటి పరచి కూర్చుండ బెట్టారు. బైట తలుపులు వేశారు... గొళ్ళెం మాత్రం పెట్టలేదు. ఎవర్నీ అటుగా వెళ్ళనీ యటం లేదు. స్వప్నతో మాటాడనీయడం లేదు అని.

ఇక ఏమి అడగాలో తెలీక ఆగిపోయాను.

అయితే ప్రశ్న మాత్రం నన్ను వదలలేదు.

వారం దినాల తరువాత స్వప్నను బయటకు తీసుకొచ్చారు. తలంటి, కొత్త బట్టలు కట్టుకొని, సొమ్ములు మెడన వేసుకుని బాగా కనిపించింది. చాలా మంది ఆడవాళ్ళు వచ్చారు. లోపల ఏదో తంతు జరిగింది. ఆ రాత్రి వారంతా ఆ పూట అక్కడ భోంచేశారు కూడా.

ఎంత పెద్ద వాళ్ళయినా మూళ్ళకు ఇట్టాంటివి చేసినట్టు అనిపించలేదు. ఎవ్వరూ చెప్పనూ లేదు. ఇంతకూ ఇదంతా ఎందుకు చేస్తున్నట్టు? ఆచా




రమా? ఇంకేదైనా అర్థమున్నదా? ఇలా ప్రశ్నలు ఎక్కువ అయ్యాయి.

అయితే మధ్యాహ్నం అక్కడ చదువుకుం టున్న పిల్లలందరికీ భోజనం పెట్టారు. పులిహోర, బొబ్బట్లు, గారెలు, పూర్ణాలు వేశారు. ఇక ఊళ్ళో నుంచి వచ్చిన ఆడంగులు బుట్ట బొమ్మల్లా తయా రయి వచ్చి స్వప్నతో అదీ ఇదీ చెప్పి మాటాడి గంధం పూసి, అక్షింతలు వేసి వెళ్ళిపోయారు.

చూసేందుకు ఇదీ పెళ్ళి వేడుకలానే అనిపిం


**'ఛీ! ఇక ఎవర్నీ అడగకూడదు' అను కుంటూండగా ఆడపిల్ల పెద్దది అవడ మంటే 'కుండ'ల్లోకి రావడంరా!' అని ముసల్ది అనడం నా చెవిన పడింది ఆగాను.**


చింది.

అయితే ఇక్కడ పెళ్ళి కొడుకు అనే శాల్తీ మాత్రం కనిపించలేదు.

OOO

సంవత్సరం గడిచిపోయింది.

అన్నయ్యా నేను చదువుకు ఎవరి బడికి వాళ్ళం పోతూనే ఉన్నాం.

అన్నయ్య మాత్రం తలకు 'రోమ్ టోపీ' పెట్టుకొని వెళ్తున్నాడు.

వాళ్ళ బడిలో చదివే వారికి అది తప్పని సరి అట.

నాకు ఇంట్లో సంస్కృత పాఠాలు కూడా నడు స్తున్నాయి. ఆచారయ్య గారని పొరుగూరి, గుడి పూజారి ప్రతి శనివారం - మా ఊరి గుడికి వచ్చి పూజాదికాలు నిర్వహించి వెళ్తుంటాడు. ఆయన వచ్చిన నాడల్లా నాకు సంస్కృతం నేర్పుతున్నాడు. ఆచారయ్య గారు చాలా నిష్ఠా గరిష్ఠుడు. పొద్దు వాలి పోతున్నా ఆయన స్వయంగా 'బావిని' చేదుకునే నీళ్ళు త్రాగేవాడు. ఎక్కడా భోజనం చేసేవాడు కాదు. మరీ కాని పరిస్థితి ఉంటే మా ఇంటికొచ్చి సాంబారాలడిగి నీళ్ళు 'బిందె'న తోడుకొని వచ్చి, వంట చేసుకొని ఇంత తినేవాడు. ఇంటి వరండాలో నున్న పెద్ద బల్ల పైన అడ్డంపడి మా అన్న దమ్ముల్లో ఎవరు కనిపించినా పురాణ కథలు చక్కగా చెప్పే వాడు. ఆయన కథలు ఎంచక్కా చెప్పే వాడంటే ఒక నాడు ఆయన రంతి దేవుని కథ చెప్పడం పూర్తయ్యే సరికి పని వాళ్ళతో సహా అమ్మ కూడా ఆయన ముందే వింటూ కనిపించారు. నాన్న వచ్చి 'సంగీ తము చేత బేరసారము లుడిగెన్' అని పెద్దలు ఊర్కే అనలేదు ఆచారి గారూ! మీరు నిత్యం ఈ ఊరు వస్తే నా వ్యవసాయం కుప్పకులిపోతుంది' అన్నాడు. అంతటి ఆకర్షణ ఆయన కథ చెప్పే తీరున ఉండేది.

నేను ఆ వేళ పొద్దుటే మా 'బడి'కి వెళ్ళాను. ఒక్క నారాయణే అప్పటికి వచ్చి బితుకు బితుకు మంటూ కనిపించాడు. స్వప్న బయట కొచ్చింది ఇంట్లో నుంచి. మమ్మల్ని చూసి నవ్వింది. నా దగ్గిర కొచ్చి 'ఒకటి'లో కొచ్చావా? అనడిగింది. ఇంకా రాలేదన్నట్టు చూశాను. అలా స్వప్నను చూస్తూనే ఉన్నాను. అసలేమిటీ పిల్ల రానురాను మరీ ఇంత అందంగా, కన్ను మలప లేనంత ఇదిగా మారుతు న్నది? అందం - మనిషికి భగవంతుడిచ్చిన వరం. గుడి ముందు ఎదిగిపడి ఉన్న అప్సరస బొమ్మలా అంత అద్భుతంగా అనిపించింది.

**(సశేషం)**